నేడు డయల్ యువర్ ఆర్టీసీ

ఖలీల్‌వాడి, డిసెంబర్ 19: టీజీ నిజామాబాద్ రీజియన్‌లో డయల్ యువర్ ఆర్టీసీని శుక్రవారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు నిర్వహించనున్నట్లు రీజినల్ మేనేజర్ జ్యోత్స్న గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు తమ సమస్యలు, సూచనలను 99592 26011, 99592 26019, 99592 26001, 99592 26016, 99592 26017, 99592 26018, 99592 26020 ఫోన్ నంబర్లకు తెలియజేయాలని పేర్కొన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు బడా రాంమందిర్ భూముల పరిశీలన

సుభాష్‌నగర్, డిసెంబర్ 19: జిల్లా కేంద్రంలోని న్యాల్‌కల్‌రోడ్ బస్‌డిపో వెనక ఉన్న పెద్దరాంమందిర్‌కు సంబంధించిన వ్యవసాయభూములను సర్వే అధికారులు శుక్రవారం పరిశీలిస్తారని ఈవో వేణు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్వే నంబర్ 1491, 92, 95, 96ల్లో సర్వే నిర్వహిస్తారని పేర్కొన్నారు.

'కూలీలందరికీ ఆసరా భృతి అందించాలి'

సిరికొండ, డిసెంబర్ 19: ఉపాధి కూలీలతోపాటు అన్ని రకాల వ్యవసాయ కూలీలకు ఆసరా భృతి అందించాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిట్ల రామకృష్ణ డిమాండ్ చేశారు. మండలంలోని గడ్కోల్ గ్రామంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కూలీలందరికీ ఆసరా భృతి అందించకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. రమేశ్, దామోదర్, సాయారెడ్డి, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై కేజ్‌వీల్ ట్రాక్టర్లు నడిపితే చర్యలు

చందూర్, డిసెంబర్ 19: రోడ్లపై కేజ్‌వీల్ ట్రాక్టర్లు నడిపితే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ శాంత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే రూ.30వేల వరకు జరిమానా విధిస్తామని ఆమె హెచ్చరించారు.

ధర్పల్లిలో నేత్ర వైద్య శిబిరం

ధర్పల్లి, డిసెంబర్ 19: జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో గురువారం ధర్పల్లి ప్రభుత్వ దవాఖానలో నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నేత్ర వైద్యులు 19మందిని పరీక్షించగా.. వారిలో ఎనిమిది మందికి మోతిబిందు ఉన్నట్లు గుర్తించారు. వారిని ఆపరేషన్ నిమిత్తం ఆర్మూర్ లయన్స్ కంటి దవాఖానకు తరలించినట్లు ఆప్థాల్మిక్ అధికారి హరినాథ్ నెహ్రూ తెలిపారు.

బడాపహాడ్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి

రుద్రూర్, డిసెంబర్19: వర్ని మండలం బడాపహాడ్ బస్టాండ్‌లో గుర్తు తెలియని వ్యక్తి గురువారం మృతి చెందాడు. మృతుడు వారం రోజుల నుంచి బడాపహాడ్ ప్రాంతంలో భిక్షాటన చేస్తూ జీవిస్తున్నాడు. చలి తీవ్రతను తట్టుకోలేక మృతి చెంది ఉంటాడని పోలీసులు తెలిపారు. దర్గా సెక్యూరిటీ గార్డు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని, మృతుడి వయస్సు 70 నుంచి 75 ఏండ్ల మధ్య ఉంటుందని పేర్కొన్నారు.

ఆర్మూర్‌లో నిరసన తెలుపుతున్న దళిత సంఘాల నేతలు

నిజామాబాద్‌లో నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

సాటాపూర్‌లో కేంద్రమంత్రి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

అమిత్‌షాపై భగ్గుమన్న దళితులు

- కేంద్ర మంత్రి వ్యాఖ్యలపై ఆగ్రహం
- దిష్టిబొమ్మలను దహనం చేసి నిరసన

మోర్తాడ్/ వేల్పూర్/ ముప్కాల్/ నందిపేట్/ ఆర్మూర్‌టౌన్/ రెంజల్/ నవీపేట/ జక్రాన్‌పల్లి/ కంఠేశ్వర్/ ఖలీల్‌వాడి, డిసెంబర్ 19: కేంద్ర మంత్రి అమిత్‌షా అంబేద్కర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ జిల్లావ్యాప్తంగా వివిధ పార్టీలు, దళిత సంఘాల నాయకులు గురువారం ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. రాజ్యసభలో హోంమంత్రి రాజ్యాంగం గురించి మాట్లాడుతూనే అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం ది గ్ర్భాంతికరమని పేర్కొన్నారు. పలుచోట్ల అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. జక్రాన్‌పల్లిలో దళిత సంఘాల నాయకులు మంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. నిజామాబాద్‌లోని పూలాంగ్ చౌరస్తాలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కేశ వేణు ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. అమిత్‌షాను కేంద్ర మంత్రి వర్గం నుంచి తప్పించాలని మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వర్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. మోర్తాడ్‌లో దళిత సంక్షేమ సంఘం అధ్యక్షుడు మల్లూరి రాజారం మాట్లాడుతూ.. నేడు మోర్తాడ్ లో ధర్నా నిర్వహిస్తామని, దళితసంఘాలు, అంబేద్కర్ యు వజన సంఘాలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి, నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు సుంకెట రవి, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ సుంకెట బుచ్చన్న, ప్రదీప్, రాజేంద్ర ప్రసాద్, శేఖర్ పాల్గొన్నారు. వేల్పూర్ మండలంలో ని పడిగెల్ గ్రామంలో దళిత సంఘం నాయకులు, ముప్కాల్ మండలంలోని నల్లూర్‌లో మాదిగ సంఘ సభ్యులు అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. నందిపేట్ మండల కేంద్రంలో దళిత సంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఆర్మూర్ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట దళిత సంఘాల నాయకులు నిరసన తెలిపారు. మాదిగ సంఘాల యునైటెడ్ రాష్ట్ర అధ్యక్షుడు కొక్కెర భూమన్న మాట్లాడుతూ.. అమిత్‌షా క్షమాపణ చెప్పాలని డిమండ్ చేశారు. రెంజల్ మండలంలోని సాటాపూర్‌లో కేంద్ర మంత్రి దిష్టి బొమ్మను దళిత సంఘాల నాయకులు దహనం చేశారు. మాల మహానాడు జిల్లా యూత్ ఉపాధ్యక్షుడు గైని కిరణ్, మండల అధ్యక్షుడు అబ్బొల్ల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నా రు. నవీపేట మండలంలోని నిజాంపూర్‌లో అంబేద్కర్ విగ్ర హం వద్ద దళిత నాయకులు నిరసన తెలిపారు. అమిత్‌షా వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు తెలిపారు. నిజామాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అమిత్‌షా మంత్రి పదవికి రాజీనామా చేయాలన్నారు.

అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి

సిరికొండ, డిసెంబర్ 19 : సొసైటీలో రూ.75 లక్షల అవినీతి జరిగిందని, అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకొని, వారి నుంచి సొమ్మును రికవరీ చేయాలని అధికారులను రైతులు నిలదీశారు. గురువారం సిరికొండ సొసైటీ మహజన సభ చైర్మన్ చెల్లెం గంగాధర్ అధ్యక్షతన నిర్వహించారు. సొసైటీ సిబ్బంది అవినీతికి పాల్పడినట్లు ఆడిటర్లు ఇచ్చిన నివేదికను సభలో రైతులకు చదివి వినిపించారు. సుమారు రూ. 75 లక్షల రికవరీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. నాలుగేండ్ల నుంచి సభ్యుల సొమ్ము రూ.75 లక్షలు సొసైటీ సిబ్బంది వాడుకోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు. అవినీతికి పాల్పడిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకొని, రికవరీ చేయాలని డిమాండ్ చేశారు.

రుణమాఫీ కాకుంటే ధర్నా చేస్తాం..

సొసైటీలో 133 మంది రైతులకు రుణమాఫీ కాకపోవడానికి సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని మండిపడ్డారు. రుణమాఫీ కాకపోతే సొసైటీ భూముల్లో టెంట్లు వేసుకుని ధర్నా చేస్తామని హెచ్చరించారు. తీసుకున్న రుణాలను చెల్లించినప్పటికీ, రైతుల వాటా సొమ్మును ఎందుకు ఇవ్వడంలేదని ప్రశ్నించారు. సొసైటీలో జరిగిన అవినీతిలో ఆడిట్ అధికారుల భాగస్వామ్యం ఉన్నదని ఆరోపించారు. ఆడిట్ అధికారులతోపాటు సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. సొసైటీ వైస్‌చైర్మన్ సాయిరి నర్సయ్య, డైరెక్టర్లు, ఆడిటర్ సత్యనారాయణ, క్లస్టర్ అధికారిణి లావణ్య, సీఈవో గిరి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బాలకవి సమ్మేళనం

ఖలీల్‌వాడి, డిసెంబర్ 19: నగరంలోని విజయ్ హైస్కూల్‌లో గురువారం బాలకవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కవితలు రాయించారు. ప్రతిభ చూపిన వారికి బహుమతులను అందజేసిన ట్లు విజయ్ విద్యాసంస్థల కార్యదర్శి అమృతలత తెలిపారు.

జీపీ కార్మికుల డిమాండ్లు నెరవేర్చాలి

ధర్పల్లిలో నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్మికులు

ధర్పల్లి/ డిచ్‌పల్లి, డిసెంబర్ 19: చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకోవడాన్ని నిరసిస్తూ గ్రామ పంచాయతీ కార్మికులు డిచ్‌పల్లి, ధర్పల్లి ఎంపీడీవో కార్యాలయాల ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా టీయూసీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆర్.రమేశ్, జిల్లా నాయకులు మురళి, జేపీ గంగాధర్, కారోబార్ల సంఘం అధ్యక్షుడు సురేశ్ మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి ఎన్నికల సందర్భంగా పంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. డిచ్‌పల్లిలో ఎంపీడీవో శ్రీనివాస్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం

జక్రాన్‌పల్లి, డిసెంబర్ 19: పడకల్ జడ్పీహెచ్‌ఎస్‌లో 1998-99 ఎస్సెస్సీ బ్యాచ్‌నకు చెందిన తలారి ప్రసాద్ ఇటీవల గుండెపోటుతో మరణించాడు. బాధిత కుటుంబానికి ఆయనతో పదో తరగతి చదివిన మిత్రులు రూ.64,500 ఆర్థిక సహాయాన్ని గురువారం అందజేశారు. కార్యక్రమంలో డీలర్ రమేశ్, గంగాధర్, సుమలత, రమేశ్ పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

సారంగాపూర్, డిసెంబర్ 19: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని యోగా గురువురు రాంచందర్, సిద్ధిరాములు అన్నారు. సారంగాపూర్ లోని బీఈడీ కాలేజీలో గురువారం యోగా శిబిరాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిలు, కో-ఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్, యోగా ప్రాజెక్టు ఇన్‌చార్జి డాక్టర్ కరుణాకర్, అధ్యాపకులు సువర్చల, రవీందర్, హరిత, గణేశ్, నరేందర్, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కల్లు డిపోను ప్రారంభించాలని వినతి

వినాయక్‌నగర్, డిసెంబర్ 19: నిజామాబాద్ నగరంలో కొంతకాలం క్రితం ఏర్పాటు చేసిన మూడో కల్లు డిపోను మూసి వేయడంతో తాము ఇబ్బందులు పడుతున్నామని డిపో సభ్యులు వాపోయారు. డిపోపై సుమారు 200 మంది సభ్యులు ఆధారపడి జీవిస్తున్నారన్నారు. మూసి వేసిన డిపోను తెరిపించాలని కోరుతూ ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

వినాయక్‌నగర్/ చందూర్, డిసెంబర్ 19: నిజామాబాద్ మండల పరిధిలోని మల్కాపూర్ తండా వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. మోస్రాకు చెందిన కొత్మీర్కర్ లక్ష్మణ్(23) మొబైల్ షాపు నిర్వహిస్తాడు. షాపునకు సంబంధించిన సామన్లు తెచ్చుకోవడానికి బైక్‌పై నిజామాబాద్ బయల్దేరాడు. మల్కాపూర్ తండా వద్ద గండిలో ఎదురుగా అతివేగంగా వస్తున్న ట్రాలీ ఆటో అతడి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో లక్ష్మణ్ కిందపడగా.. తీవ్ర గాయాలయ్యాయి. 108 అంబులెన్స్‌లో జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి అన్న రాహుల్ ఫిర్యాదు మేరకు ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహ్మద్ ఆరీఫ్ తెలిపారు.

రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన

ఖలీల్‌వాడి, డిసెంబర్ 19: రోడ్డు భద్రతా నియమాలపై నాందేవ్‌వాడ బీసీ బాలుర సంక్షేమ వసతి గృహ విద్యార్థులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్, బీసీ సంక్షేమ శాఖ అధికారిణి స్రవంతి, బీసీ డెవెలప్‌మెంట్ అసిస్టెంట్ అధికారి నర్సయ్య, ఐడార్ జిల్లా మేనేజర్ వర్ష హాజరై విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలను వివరించారు. హాస్టల్ వార్డెన్లు రాజు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

ధర్పల్లి, డిసెంబర్ 19: మండలంలోని దమ్మన్నపేట్ గ్రామ ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను తహసీల్దార్ మాలతి గురువారం తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం, వంట సరుకులను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని హెచ్ఎం రాంచందర్‌కు సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని, గ్రామంలో చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేను ఆమె పరిశీలించారు.

శంకర్‌భవన్‌లో టాలెంట్ డే

ఖలీల్‌వాడి, డిసెంబర్ 19: నగరంలోని శంకర్ భవన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఇందూర్ ఆధ్వర్యంలో గురువారం టాలెండ్ డే నిర్వహించారు. విద్యార్థులకు పలు రకాల పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా అదనపు కార్యదర్శి కరిపె రవీందర్, హెచ్ఎం వాసుదేవారావు, లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎ.లింబాద్రి, సీహెచ్.రవీంద్రనాథ్, కోశాధికారి రాఘవేందర్, పూర్వ అధ్యక్షుడు గంగాదాస్, ఉపాధ్యాయులు మల్లేశ్, సురేశ్ పాల్గొన్నారు.

క్రీడాకారులకు సన్మానం

సారంగాపూర్, డిసెంబర్ 19: రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల్లో సారంగాపూర్ జడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన ఐదుగురు విద్యార్థులు పాల్గొని ప్రతిభ చూపారు. వారిని వీడీసీ సభ్యులు, ఉపాధ్యాయులు అభినందించారు. చత్తీస్‌గఢ్ రాష్ట్రంలో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన పల్లపు రక్షితకు రూ.నాలుగు వేల ఆర్థిక సహాయం అందించారు. తిర్మన్‌పల్లి జడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన సాయిదీక్షిత కూడా జాతీయ స్థాయి నెట్‌బాల్ టోర్నీకి ఎంపికైనందున హెడ్మాస్టర్ సీతాదేవి ఉపాధ్యాయులు అభినందించారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు

పొతంగల్, డిసెంబర్ 19: ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో హెచ్చరించారు. పొతంగల్ మండలంలోని మంజీరా పరీవాహక ప్రాంతాల నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారం మేరకు ఆయన గురువారం తనిఖీ చేశారు. మండలంలోని హంగర్గా గ్రామ శివారులో ఉన్న మంజీరా ప్రాంతాన్ని పరిశీలించారు. ఇసుకను తరలించేందుకు తప్పకుండా ప్రభుత్వ అనుమతి తీసుకోవాలని సూచించారు. ఇసుకను అక్రమంగా తరలిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

టీయూలో పునఃశ్చరణ తరగతులు

డిచ్‌పల్లి, డిసెంబర్ 19: టీయూలో తెలుగు అధ్యాపకులకు రెండోరోజు గురువారం పునఃశ్చరణ తరగతులు కొనసాగాయి. ప్రముఖ కవి, విమర్శకులు, ఓయూ ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఖాసీం ప్రముఖ కవి, రచయిత్రి యుద్దనపూడి రెడ్డి శ్యామల, ప్రముఖ విమర్శకులు గుంటూరు లక్ష్మీనర్సయ్య మాట్లాడారు. నిర్వాహకురాలు లావణ్య, సంస్థ కార్యదర్శి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వారసంత ప్రారంభం

రెంజల్, డిసెంబర్ 18: మండల కేంద్రంలో కూర గాయల వార సంతను ఆలయాల కమిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు గురువారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ రెంజల్ చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు తాజా కూర గాయలను అందుబాటులో ఉంచేందుకు ప్రతి గురువారం సంత నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు వ్యాపారులకు సహకరించాలని కోరారు.

బైక్ దహనం

మాక్లూర్, డిసెంబర్19: మండలంలోని గుంజిలి గ్రామానికి చెందిన పత్తేపూర్ కురుమ కిషన్‌కు చెందిన బైక్‌ను బుధవారం రాత్రి దుండగులు దహనం చేశారని ఎస్సై రాజశేఖర్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. ఇంటి ఎదుట బైక్‌ను నిలిపి ఉంచగా దుండగులు దహనం చేయగా వంట గది కిటికీ అద్దాలు పగిలిపోయి పొగ రావడంతో కుటుంబ సభ్యులు బయటికి వచ్చి చూశారు. అప్పటికే బైక్ పూర్తిగా కాలిపోయింది. ఉపాధి నిమిత్తం కిషన్ దుబాయ్‌లో ఉంటున్నాడని, ఆయన భార్య సుమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

భీమ్‌గల్, డిసెంబర్19: మండలంలోని బాబానగర్ కాలనీకి చెందిన కుండల పెద్దరాజన్న(75) జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. ఈనెల 13న మండలంలోని కుప్కల్ గ్రామ శివారులో పొలంలో వో వృద్ధుడు స్పృహ కోల్పోయి పడి ఉన్నాడని పోలీసులకు సమాచారం అందింది. వారు వెళ్లి వృద్ధుడిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్సులో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య కాసమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అనుమతులు లేని భవన నిర్మాణ పనులు నిలిపివేత

నవీపేట, డిసెంబర్ 19: మండలంలోని ధర్మారం శివారులో రైల్వే గేటు సమీపంలో జీపీ అనుమతులు లేకుండా కొనసాగుతున్న భవన నిర్మాణ పనులను నిలిపివేసినట్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్ గురువారం తెలిపారు. ఎంపీవో రామకృష్ణ మాట్లాడుతూ గ్రామానికి చెందిన సూర నర్సయ్య అసైన్డ్ భూమిని కొంత మేరకు కబ్జా చేసి షట్లర్లు నిర్మాణం చేపడుతున్నాడని పేర్కొన్నారు. ఇటీవల రెండు సార్లు జీపీ నుంచి నోటీసులు ఇచ్చినా పనులు కొనసాగించడంతో మూడో సారి నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు.

మాల మహానాడు నాయకుల ముందస్తు అరెస్టు

బోధన్ పోలీస్ స్టేషన్‌లో మాల మహానాడు నాయకులు

ఆర్మూర్ పోలీస్ స్టేషన్‌లో నినాదాలు చేస్తున్న మాల మహానాడు నాయకులు

నందిపేట్ పోలీస్ స్టేషన్‌లో మాల మహానాడు నాయకులు

బోధన్/నందిపేట్/మాక్లూర్/ఆర్మూర్‌టౌన్/ రుద్రూర్/ డిచ్‌పల్లి/ జక్రాన్‌పల్లి/ పొతంగల్, డిసెంబర్ 19: ఎస్సీ వర్గీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ అసెంబ్లీ ముట్టడికి మాల సంఘం నాయకులు పిలుపునిచ్చిన నేపథ్యంలో జిల్లాలోని వివిధ మండలాల నాయకులను గురువారం తెల్లవారు జామున పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. అదుపులోకి తీసుకున్న నాయకులను సంబంధిత పోలీస్‌స్టేషన్లకు తరలించారు. వర్గీకరణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం మాల, మాదిగల మధ్య చిచ్చుపెట్టేందుకు కుట్ర పన్నుతోందని మాల మహానాడు నాయకులు విమర్శించారు. మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు, బోధన్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంపల్లి ఎల్లయ్య, నవీపేట్ మాజీ ఎంపీపీ శ్రీనివాస్, మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి నీరడి ఈశ్వర్ కుమార్, బోధన్ డివిజన్ ఉపాధ్యక్షుడు కారం స్వామి, పల్లాటి యాదగిరిని బోధన్ పోలీసులు అరెస్ట్ చేశారు. నందిపేట్‌లో ఉమ్మడి నందిపేట్ మండలాల మాల సంఘాల నాయకులు రాజన్న, సురేశ్, నాగరాజు, మోహన్, జీవన్, రాజేశ్వర్, సంజీవ్, శివ, రాములు పాల్గొన్నారు. మాక్లూర్‌లో మాల సంఘం నాయకులు మాజీ ఎంపీపీ ప్రభాకర్‌తోపాటు మాల నాయకులు సతీశ్, సురేశ్, గంట చిన్నయ్య, భోజన్న, అశోక్‌ను అరెస్ట్ చేసినట్లు ఎస్సై రాజశేఖర్ పేర్కొన్నారు. అనంతరం వారిని విడుదల చేశారు. ఆర్మూర్‌లో మాలమహానాడు రాష్ట్ర నాయకుడు అర్గుల్ సురేశ్, అగ్గు క్రాంతి తదితరులను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. నవీపేట మండలం నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న మాల మహానాడు నాయకులను ఎస్సై వినయ్ అడ్డుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. గైరు రాజు, నీరడి బుచ్చన్న, బత్తూర్ సాయిలు, రాజు తదితరులను అరెస్టు చేశారు. రుద్రూర్‌లో నాయకులు బదెల సంజీవ్, కిశోర్‌ను, డిచ్‌పల్లిలో నీరడి పద్మారావు, పత్తి ఆనంద్, ప్రమోద్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జక్రాన్‌పల్లిలో మాలమహానాడు నాయకులు బంగ్లా వసంత్‌రావు, హరీశ్ మాట్లాడారు. మాల మహానాడు పొతంగల్ మండల అధ్యక్షుడు రాహుల్ సోన్ కాంబ్లేను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు.

ఇందిరమ్మ ఇండ్ల సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

మోర్తాడ్ గురుకుల పాఠశాలలో విద్యార్థితో మాట్లాడుతున్న కలెక్టర్

మోర్తాడ్, డిసెంబర్19: ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సిబ్బందిని ఆదేశించారు. గురువారం మోర్తాడ్, వడ్యాట్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. స్థలాలు ఉండి ఇండ్లు నిర్మించుకునే వారు, పాత ఇండ్లు ఉండి వాటిని తొలగించి నిర్మించుకునే వారి వివరాలు తప్పులు లేకుండా పొందుపర్చాలని సూచించారు. ప్రజాపాలన దరఖాస్తుల్లో పొందుపర్చిన సమాచారం ఆధారంగా వివరాలను నమోదు చేయాలని సూచించారు. అంతకు ముందు మోర్తాడ్‌లోని బీసీ బాలుర గురుకుల పాఠశాలను కలెక్టర్ సందర్శించారు. నూతనంగా అమలు చేస్తున్న మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం, అల్పాహారం అందించాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థులతో మాట్లాడి బోధన తీరును అడిగి తెలుసుకున్నారు. వసతిగృహం పరిసరాలను పరిశీలించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో తిరుమల, ఏపీవో శ్రీధర్ తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల సర్వే పరిశీలన

మాక్లూర్, డిసెంబర్ 19: మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇండ్ల సర్వే కార్యక్రమాన్ని ట్రెయినీ కలెక్టర్ సంకేత్‌కుమార్ పరిశీలించారు. తహసీల్దార్ శేఖర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అధికారులతో మాట్లాడారు. ఆయన వెంట ఎంపీవో శ్రీనివాస్, కార్యదర్శి రాకేశ్ తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న సర్వే

భీమ్‌గల్/కోటగిరి, డిసెంబర్ 19: మండలంలోని అన్ని గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల సర్వే కొనసాగుతున్నదని ఎంపీడీవో సంతోష్‌కుమార్ తెలిపారు. ఇప్పటివరకు 1350 మంది దరఖాస్తుదారుల సమాచారం సేకరించినట్లు తెలిపారు. కోటగిరి మండలంలోని కొత్తపల్లి, దేవునిగుట్ట తండాల్లో చేపడుతున్న సర్వేను తహసీల్దార్ గంగాధర్ పరిశీలించారు. ఆయన వెంట జీపీ కార్యదర్శులు స్వప్న, ప్రియాంక ఉన్నారు.

నందిపేట్‌లో ఎస్‌బీఐ శాఖ ప్రారంభం

నందిపేట్, డిసెంబర్ 19: మండల కేంద్రంలో ఎస్‌బీఐ నూతన శాఖను గురువారం ప్రారంభించారు. బ్యాంకు అధికారులతోపాటు కేదారేశ్వర ఆశ్రమ వ్యవస్థాపకుడు మంగిరాములు మహరాజ్ జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో డిప్యూటీ జనరల్ మేనేజర్ బిజయకుమార్, రీజినల్ మేనేజర్ మహేశ్వర్, స్థానిక మేనేజర్ దొరబాబు పాల్గొన్నారు.

ఈవ్‌టీజింగ్‌కు గురైతే సమాచారం ఇవ్వాలి

బాల్కొండ/శక్కర్‌నగర్, డిసెంబర్ 19: ఈవ్ టీజింగ్ చేస్తే షీ టీమ్ నంబర్ 8712659795కు లేదా 100కు సమాచారం ఇవ్వాలని సబ్ డివిజన్ షీటీమ్ కానిస్టేబుళ్లు విష్ణోశ్, సుమతి అన్నారు. చిట్టాపూర్ జడ్పీహెచ్‌ఎస్‌లో సైబర్ క్రైమ్‌పై విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. బోధన్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో షీటీమ్ అధికారులు విజయ్, సుజాత అవగాహన కల్పించారు. మహిళకు రక్షణ కల్పించేందుకు పోలీస్‌శాఖ ద్వారా ఏర్పాటు చేసిన సౌకర్యాలను వివరించారు. హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

General public are hereby informed that my client M/S Shriram Finance Ltd, Nizamabad Branch-II, Dist. Nizamabad agreed to